# కల్లుకుండల బాగోతం

ఆకుల నారగౌడంటే ఊర్లె పెద్దమనిషి. పేరు చెప్పితే హడల్. ఎనుకట నాటుకాలాడిండట. ఏ పంచాది జరిగినా ఆయినను పిలుచుకుంటరు. నారగౌడు ఉన్నడంటే వాళ్లమాట నెగ్గినట్టే. ఒక్కనాడు ఈతచెట్టు ఎక్కింది లేదు. కల్లులొట్టి మోసింది లేదుగనీ, మావులా మొత్తం ఆయిన మాట మీదనే నడుస్తది.

అది దీపావళికి అటూ ఇటూ కాలం. పనేం లేదు. ఇంకోనాలుగు రోజులైతే కోతలు పడుతరు. ఈ మధ్య మేము నాటుకం వెయ్యక నెలా రెండు నెలలు దాటింది. ఇప్పుడు కొద్దిగా పని తీర్పాటం దొరికింది.

మా కొండయ మామ ఉన్న జాగలుండడు. నారగౌడు కొడుకు పెండ్లి చేస్తుంటే 'ఇంతపెద్ద గౌడువు. కొడుకు లగ్గానికి ఆట ఆడిపియ్యవా..?' అని అడిగిండు.

'ఆడుంగ్రి. వద్దంటున్ననా... పైసలు మాత్రం ఇయ్య. మీరు తాగినంత కల్లువోత్త' నారగౌడు అన్నడు.

'మేకప్ సామాన్లు వట్టిగత్తయా..ఏం లేదన్నా నూరు నూటపది రూపాయలు గావాలె. అంతమందమైనా ఇయ్యి'. మామ అన్నడు.

నారగౌడు ఒప్పుకున్నడు. మరువెండ్లినాడు ఇంటిముందే స్టేజి ఎయ్యాలన్నడు. 'లక్ష్మణ పరిణయం' ఎయ్యాలని ఆటపేరు గూడా చెప్పిండు. ఇయ్యనీ ఇయ్యకపోనీ నాటుకం ఆడాలని కొండయమామ కోరిక. ఆయినేం మనిషోగనీ వరుసగ వారంరోజులు ఆడుమన్నా ఆడుతడు.

"లక్ష్మణ పరిణయం" ఆటను మేము ఎప్పుడో నేర్చినం. మా కొండయ మామ విశ్వామిత్రుడు. దాసు చిన్నాయిన జనకమారాజు. లక్ష్మణుడు గడ్డమీది రాములు. ఊర్మిల పోశెట్టి. నారాగౌడ్ చెప్పినమాట అందరికీ చెప్పిండు కొండయ మామ.

వెయ్యి రూపాయలిచ్చినా జరుగని పని కల్లుకుండతో జరుగుతది. కడుపునిండా కల్లువోత్తడనే సరికి మావోళ్లంతా తలూపింగ్రు. ఈ ముచ్చట మా పంతులుకు తెలిసింది.

'కల్లుకుండలకు ఆటాడుతాగ్రా...నీయవ్వా..వట్టి కడుపు గుత్తోళ్లున్నరు' అని యాష్టపడ్డడు. ఆటవద్దె వద్దన్నడు. మేము వినలేదు.

"మాట ఇచ్చినము గదా. నారగౌడు అందరితో చెప్పుకుంటడు. పెండ్లి ముచ్చటనాయె. ఆడితీరాల్సిందే" అన్నం. అయితే మీ ఇష్టం నేనైతే రానన్నడు పంతులు. రాకుంటే రాకపోతివి. మాకు ఆడరాదా అనుకున్నం.

అన్నట్టుగనే మరువెండ్లినాడు ఆటమొగిచ్చింగ్రు. పంతులు రానన్నడు కదా! నాకు పుస్తకమిచ్చి తప్పిపోయిన పాటను అందియ్యమన్నరు. నాది శత్రగ్ని ఏశం. ఆఖరుకు రెండుపాటలుంటయి అంతే!

చెప్పినట్టుగనే నారగౌడు పాము ఇసమసొంటి కల్లును నాలుగుకుండలు పంపిండు. కుండలను గరిశెలగడ్డకు మా ఎడ్లకొట్టంలనే పెట్టుకున్నం. మొదాలు కల్లుతాగినంకనే ఆడుదామన్నరు కొందరు.

'తాగినంక ఎట్లాడుతవురా..నిద్ర రాదా...పాణం సొలుగదా...ఆటాడినంక అందరం కూసుండి తాగుదాం.' అని గదరాయించిండు కొండయ మామ. అందరూ సరేనన్నరు.

మా ఎడ్లకొట్టం నారగౌని ఇంటికి దగ్గరనే ఉంది. ఇంటిముందు సందిలోంచి గుట్ట ఎక్కి దిగితే సక్కగ ఎడ్లకొట్టంలకే.

అందరం మేకప్ మీద కూసున్నం. లక్ష్మణుని ఏశమేసే రాములు, ఊర్మిల ఏశమేసే పోశెట్టి ఇద్దరూ ఒక్కదగ్గర కూసున్నరు.

"ఆరేయ్ మామా..ఆట పూర్తయ్యేదాక మన ఏశాలుండాలె. మిగిలినోళ్లు ఆఖరుదాక ఉండరు. మధ్యలోనే వాళ్ల పాత్రలు అయిపోతయి. ఏశాలు ఇప్పేసినంక మనం వచ్చేదాకా ఇక్కడనే ఉంటరనుకున్నావా. ఏశం ఇప్పేసినోడు ఇప్పేసినట్టు కల్లుకుండల కాడికిపోతరు. మనం పోయేవరకు మొత్తం ఖాళీజేత్తరు. అందుకే మనం ఇప్పుడే రెండు సాకలు తాగివద్దాం" 'రాములు అన్నడు. నారగౌడు కల్లుకుండలు తెచ్చిన నుంచి వానికి మనుసంతా కుండలమీదనే ఉంది.

'అవునురా అల్లుడా. ఒకవేళ గిన్నెడో గిలాసెడో ఉంచినా అర్థరాత్రి దాటుతదిగదా! కల్లు పులుపుకెక్కుతది రుచి ఉండది. తాగితే ఇప్పుడే తాగాలె' అన్నడు పోశెట్టి.

మేకప్ వేసుకున్నట్టే వేసుకుంటూ వీళ్లిద్దరూ ఎనకనుండి ఎనకకే జారుకున్నరు. ఎవల ఆగంల వాళ్లున్నరు వీళ్లను ఎవలు చూడలేదు. కండ్లు మూసి తెరిచేవరకు మాయమయింద్రు.

మా పంతులే ఉంటే ఆట అయిపోయేవరకు ఎవలనూ కదలనిచ్చే వాడుకాదు. నేను ఇదంతా సూత్తనే ఉన్న. కానీ కల్లుతాగపోతున్నరని మాత్రం తెలువది. ఒంటేలుకో, నీళ్లు తాగనో పోతుంద్రనుకున్న.

నడీఊర్లె కాబట్టి జనం పట్టుజాలలేదు. సలివెడుతున్నా దుప్పట్లు కప్పుకొని వచ్చింద్రు. చాలా మందికి కూసుండ జాగదొరుకక నిలవడ్డరు. కొందరైతే పాతగోడలెక్కి కూసున్నరు.

ఏశాలు ఏసుడు పూర్తయింది. ఆట మొదలువెడుదామని పోశెట్టి, రాములు కొరకు చూసింద్రు. వాళ్లు ఎక్కడాలేరు. కొండయ మామ ఆగం చెప్పరాదు. "ఈ గాడిది కొడుకులు ఏటోపోయిరి" అనుకుంటా స్టేజిసుట్టూ తిరుగుతున్నడు. అందరినీ అడుగుతున్నడు.

మేటివేశాలు వాల్లేగదా. ఎక్కడా కనవడలేదు. చూసి చూసి వాళ్ల ఇండ్లల్లకుపోయి చూసింద్రు. అక్కడ లేరు. అందరూ ఆగంల వడ్డరు. మనిషికో దిక్కు దేవులాడుతంద్రు.

సూడంగ సూడంగ ఇద్దరు సొలుక్కుంట సొలుక్కుంట వచ్చింద్రు. కల్లువాసన గప్పుమంది. వీళ్లను చూసినంక కల్లుతాగి వచ్చింద్రని అందరికీ అర్థమైంది. ఆఖరున

వచ్చే వేశకాళ్లు ఇంకావేశం వెయ్యలేదు. వాళ్లు సూపులతోనే బదులుకున్నరు. పోదామా అంటే పోదాం అనుకున్నరు. అందరు గుంపులెక్క పోతే అనుమానం వస్తదని ఒక్కరెనుక ఒక్కలు దారివట్టిండ్రు.

ఇంక కొంతమంది పోతున్న సంగతి ఏశమేసుకున్నోళ్లకు తెలువది. వాళ్లు రాములును పోశెట్టిని తిడుతండ్రు. ఇప్పుడే సొలుగుతున్నరు. పాటలెట్లపాడుతరని కోప్పడుతున్నరు. వాళ్లిద్దరూ తాగిన తిక్కమీదున్నరు. 'మాకు పాట పాడరాదంటుండ్రు గదా. ఇగ మేము పాడనే పాడము ఏంజేసుకుంటరో చేసుకోండ్రి. అని మలుసుకుని పన్నరు. ఎంతకూ లెవ్వరు. ఎంత సర్ధిచెప్పినా వినరు.

అప్పటికి రాత్రి పొద్దుపోయింది. జనాలు బొబ్బపెడుతండ్రు. "ఏమాయెరో..ఆడుండ్రిరో...ఇంకెప్పుడత్తరురో" అంటండ్రు. లోపలి సంగతి వాళ్లకేం తెలుసు.

మా కొండయ మామ రాములును బలవంతంగా లేపి మొఖానికి రంగుపూసి బుదురకిచ్చి ముందుకు తోలిండు. 'లచ్చుమన సామి వచ్చెనూ...ఇదిగో కల్లుకుండ తెచ్చెనూ' అనిపాట అందుకుని రెండడుగులేసి కిందబడిపోయిండు రాములు. వాన్ని పడిపోకుండా అందుకుని ఎనక్కు తీసుకచ్చిండు కొండయ మామ.

'ఈ రోజు ఆటాలేదు, గీటాలేదు' అంటూ వాడు మళ్లీ మలుసుకుని పండుకున్నడు. ఊర్మిలనైతే నిద్రదీత్తుంది. ఎనుకకు జూత్తే ఇద్దరు ముగ్గురు ఏశకాళ్లు తప్ప ఎవలూలేరు. అందరూ కల్లుకుండల దగ్గరికి జారుకున్నరు.

కొండయమామ బాగా ఆలోచించిండు. నారగౌడు మంచి మనిషికాదు. ఈరోజు ఎట్లయినా ఆటసాగది. ఈ విషయం తెలిస్తే నారగౌడు తన్నినా తంతడు. ఇగ కనవడద్దనుకున్నడు. యానంగనో బయటపడ్డడు. పోతూపోతూ నాకు గూడా రమ్మని సైగచేసిండు. ఏం జరుగుతదో సూద్దామని నేను మందిలోకెళ్లి నడుమల కూసున్న.

బయట జనం కీకెలు బొబ్బలు. "ఏమాయరో...ఆడరేందిరో...లోపల ఏంజేత్తండ్రురో ఆటలేదు, పాటలేదు" అని ఒర్రుతండ్రు. బొబ్బలు వెడుతండ్రు. ఈ కీకలకు బయపడి ఉన్న ఒకలిద్దరు గూడా జారుకున్నరు.

ఆట ఆడుతలేరన్న ముచ్చట నారగౌనికి తెలిసింది. కట్టె అందుకుని సక్కగ కొట్టంకాడికి పోయిండట. అందరూ ఏశాలమీదనే లొట్టిముంగట కూసున్నరట. తాగింది నెత్తికెక్కింది. అక్కడనే పాటలు పాడుతండ్రట. రాగాలు తీత్తండ్రట.

'ఓరేయ్... ఆటాడుతమని ఇక్కడ తాక్కుంట కూసుంటార్రా.... నీతల్లి' అని కట్టెమర్రేత్తే చెట్టుకొకడు గుట్టకొకడు ఉరికింర్రట.

ఇక్కడ రాములు గడికోసారి లేచికూసుండుకుంట 'లచ్చిమన సామిని వచ్చితీ' అంటూ తబ్లాలను కొడుతండు. ఊర్మిలను 'ఇంకా నిద్రలెవ్వవేందే' అని లేపుతండు. వాడు నిద్రలోనే 'ఎవడవురా నీచుడా! నా భర్తాలుడు గనుక చూస్తే నీ శిరస్సును ఖండిస్తాడు' అంటున్నాడు. వీళ్లు ఇద్దరే మిగిలింర్రు స్టేజివెనుక.

జనంల ఎవ్వలకో కోపమచ్చింది. స్టేజివెనుకకు వచ్చి చూసింర్రు. రాములు పోశెట్టి ఇద్దరే కనిపించింర్రు. రాములును లేవట్టి పెంటల ఎత్తేసింర్రు. వానికి పెయ్యంతా పెండనే! తీటకొలిక్కాయ తెచ్చి పోశెట్టి కాళ్లకు, చేతులకు రాసింర్రు. వాడు మొత్తం గీకుడుగోకుడు. ఒకడు పెట్రమాక్స్‌లైటు పలగ్గొట్టిండు. ఒకడు షాందిరికూలగొట్టిండు. జనమంతా తిట్టుకుంట ఇండ్లళ్లకు పోయింర్రు.

'సాకలి మంగలిపొత్తు. ఇంటికిరాదు ఇత్తు. కల్లుకుండలు చూసినంక వాళ్ల పానం ఆగుతాదిరా! ఈ నారగౌనిది తప్పుగాదు. రేపుపొయ్యనుండె. లేదంటే పొద్దున్నే పోసేదుండె. కండ్లముంగట కల్లు కుండవెట్టి ఆడుమంటే వాళ్లపాణం యాడుంటదిరా' అని ఊరు ఊరంతా నారగౌన్నే తప్పు వట్టింర్రు. నారగౌడు కొండయ మామను తిట్టుడేగాదు. వచ్చిన సుట్టాలముంగట ఇజ్జత్‌పోయిందని బాధపడుడేగాదు.

మాకు తల కొట్టేసినట్టయింది. తెల్లారి అందరు బాధపడ్డరు. అట్ల చేసేదిగాకుండె అనుకున్నరు. రాములు, పోశెట్టి, వీడేనంటే వీడేనని ఒకరినొకలు తిట్టుకున్నరు. రెండురోజుల్లో అదే నాటకాన్ని నారగౌని పేరుమీద కచీరుకాడ బ్రహ్మాండంగా ఆడి అందరినీ మెప్పించినం.

మొదటిసారిగా కొండయమామ మాటను దాటినందుకు మామ మనస్సునొచ్చుకున్నడు. పంతులు గూడా మస్తు బాధ పడ్డడు. ఇంకొకసారి కల్లుకుండలకు ఆశపడి బాగోతం ఆడద్దని ఒట్టు తీసుకున్నడు.